

# అభిమానం అడిగింది

-కోరం రాజబాబు



ఊపిరి బిగబట్టి నడుస్తున్నాను.

పొలిమేరలు దాటి గ్రామంలోకి వచ్చాక ఉద్వేగాన్ని ఆపడం ఎంత కష్టమో అర్థమయ్యింది. గమనిస్తే పరిసరాల్లో కొద్దిగా మార్పు కన్పిస్తోంది. అప్పుడు వీధి దీపాలు లేవు. ఇప్పుడవి వెలుగుతున్నాయి. మట్టిరోడ్డు పోయి కంకర రోడ్డు వచ్చింది. అక్కడక్కడా చిన్నచిన్న డాబాలు, పెంకుటిళ్ళు కన్పిస్తున్నాయి.




**మా**ర్పులేనిదొక్కటే...

''మంజీర'' ప్రవహిస్తూనే ఉంది. అక్కడక్కడా ఇసుక దిబ్బలు వేశాయి. నది కాస్త వెడల్పయ్యింది.

నెమ్మదిగా చీకటి పడుతోంది. నన్నెవరూ పట్టించుకోకపోవడం ఏమంత విశేషం కాదు.

నది వెంటే కొంచెం దూరం గట్టు మీద నడవాలనిపించింది.

నదిని చూశాక మనసెక్కడికో... పదేళ్ళు వెనక్కి పరుగెడుతోంది.

ఆపాలి! ఆ జ్ఞాపకాలు ఆగిపోవాలి. నా మనసు చెదిరిపోక ముందే అవి ఆగిపోవాలి!

నా పిచ్చిగాని... జ్ఞాపకాన్ని ఆపడం ఎవరి తరం. వీటికున్న స్వేచ్ఛా పరిధి చాలా పెద్దది. ఎల్లాగైనా, ఎక్కడికైనా అవి సంచరిస్తాయి. భయపెడతాయి, బుజ్జగిస్తాయి, ఆవేశం పుట్టిస్తాయి, ఆలోచనల్ని చంపేస్తాయి.

విచిత్రమేమంటే...? ఒంటరితనంలో అవి మనిషి వెంటే ఉంటాయి. ఎంత వద్దనుకున్నా నా మనసు ఎక్కడికో పరుగెడుతోంది. ఒకటి కాదు.. రెండు అంతకన్నా కాదు!

పదేళ్ళు వెనక్కి?

OOO

నేను కాలేజ్ చదువుతున్న రోజులవి. మాది పల్లెటూరు కావడంతో పక్కనే ఉన్న పట్టణానికి కాలేజ్ చదువులకోసం నన్ను పంపించారు. నిజానికి చదువే వద్దన్నారు. చదివింది చాలు... అయినా మన ఇళ్ళల్లో ఆపాటి చదువులు సరిపోవా ఏంటి? అన్నారు.

నేను మాత్రం చదవాలనే నిర్ణయించుకుని రోజూ పట్నం వెళ్ళే బస్సులో కాలేజ్‌కు వెళ్ళేదాన్ని. ఇంట్లో వాళ్ళందరికీ సనాతన భావాలు ఉన్నప్పటికీ నేను మాత్రం స్వతంత్రంగా ఆలోచించేదాన్ని. నా మనసుకు నచ్చింది చేయడం తప్ప మరో ఆలోచన ఉండేదికాదు.

మంజీర... ఆ నది అంటే నాకెంతో ఇష్టం. నా చిన్నతనం అంతా అక్కడే గడిచిపోయింది. నిజానికి నా జ్ఞాపకాల నేస్తం ఆ నది. అక్కడ ఆటలాడుకోవడం అంటే ఎంతో ఇష్టపడేదాన్ని. స్వేచ్ఛగా ఉండేదాన్ని. ఆ నాటి స్వేచ్ఛ ఇప్పటి నా స్వతంత్ర భావాలకు పునాది కావచ్చు కూడా!

నేను పెరిగి పెద్దదాన్నయ్యేకొద్దీ నా ఆలోచనలు కూడా స్వేచ్ఛగానే పెరిగాయి. నా స్వేచ్ఛకు, భావాలకు అనుగుణంగా జీవించాలని ఆశించడం తప్పు కాదుగా ...

సరిగ్గా అటువంటి పరిస్థితుల్లో పరిచయమయ్యాడు భాస్కర్. ఎందుకో అతనితో స్నేహం వెన్నెలంత చల్లగా అన్పించేది. అతను మాట్లాడుతుంటే మనసు గిలిగింతలు పెట్టేది. మా స్నేహం ప్రేమగా మారడానికి అట్టే సమయం పట్టలేదు. ప్రేమించినప్పుడు నేనతని కులం, మతం గురించి ఆలోచించలేదు కూడా! జీవితమంతా అతనే తోడుగా ఉండాలని ఆశపడ్డాను.

అయితే... నా కోరికను మా వాళ్ళు అంగీకరించలేదు. ఒకే కులం కాదన్నారు. పైగా అతనిది తక్కువ కులం అన్నారు. నాకైతే ఆ పట్టింపులు లేవన్నాను. మాకు ఉన్నాయన్నారు వాళ్ళు. అమ్మా నాన్న ఒకడుగు ముందుకేసి చస్తామని బెదిరించారు. ప్రేమించినప్పుడు ఆ సమస్యలు మామూలే అనుకున్నాను. అయితే ఇంట్లో ఆ విషయం సీరియస్‌గా తీసుకుంటారనుకోలేదు. కోపం, ఆవేశం కొద్ది రోజుల్లో చల్లబడకపోతాయా అన్న ఆశ మాత్రం నెరవేరలేదు.

ఫలితం?

కాలేజ్ మాన్పించేశారు. అయినా నా ఆలోచనల్ని ఎవరు ఆపగలరు? మంజీరలా సాగిపోయే నా ఆశను ఎవరు అదుపు చేయగలరు?

ఓ రాత్రి....

ఇంట్లోంచి వెళ్ళిపోయాను.

అందరూ లేచిపోయిందని భావించుంటారు.

భాస్కర్ మాత్రం నన్ను మోసం చేయలేదు.

అది జరిగి సరిగ్గా ఇప్పటికి పదేళ్ళయింది!!

సంఘటన పెద్దదయినా చిన్నదయినా సరే దాన్ని మనం రిసీవ్ చేసుకునే స్థాయిని బట్టి రియాక్షన్ ఉంటుంది.

ఒక్కసారి ఆశించింది జరగదు.

కొన్నిసార్లు ఆశించకుండానే మన సొంతం కావచ్చు.

అది మన తలరాత కాదు. మన జీవితానికి ఏర్పడిన గమ్యం.

ఈ గ్రామం నన్నిప్పుడు ఎలా రిసీవ్ చేసుకుంటుందా అని ఉక్కిరిబిక్కిరి అవుతున్నప్పుడు ఎదురయిన ప్రశ్న?

ఎవరింటికెళ్ళాలి?

ఆలోచనలు నన్ను కాసేపు కదలకుండా చేశాయి.

''అత్తయ్య'' గుర్తొచ్చింది.


నిజమే... అత్తయ్యంటే నాకెంతో ఇష్టం. ఆమె ఒక్కరే నా చర్యను తప్పుకుండా సమర్థించి ఉంటుంది. ఆలోచించకుండా అటు వైపు అడుగులేశాను.

అత్తయ్య వాళ్ళది పెంకుటిల్లు. చాలా పెద్ద లోగిలి. అరుగులు ఎత్తుగా ఉంటాయి. దగ్గరకొచ్చాక గమనిస్తే ఇప్పటికీ అలాగే ఉంది.

నెమ్మదిగా మెట్లెక్కి తలుపు తట్టాను.

ఎవరది?

అది అత్తయ్య మాటే ... నేను మౌనంగా ఉన్నాను.




వెంటనే తలుపు తెరుచుకుంది.

చాలా సేపు నన్ను పోల్చుకోలేదామె. గుర్తించాక ''రాజీ'' అంది ఆశ్చర్యంగా!

లోపలికి రా! నేనేమి కలగనడం లేదు కదా!

లేదత్తయ్యా! నేను రాజ్యలక్ష్మినే అన్నాను.

బాగా మారిపోయావమ్మా... ఎన్నాళ్ళకు నిన్ను చూశానే అంటూ అత్తయ్య కంటతడి పెట్టు కుంది.

''రాజీ'' నువ్వొక్కదానివే వచ్చావే!

మీ ఆయన, పిల్లలు...

చెబుతాలే అత్తయ్యా! నాకేదన్నా పెట్టవూ ఆకలేస్తోంది అన్నాను.

ఇంటికెళ్ళావా?

''ఊహు ....'' ముందు నీ దగ్గరకే వచ్చాను.

అత్తయ్యా... అమ్మ, నాన్న!

నిన్ను చూడాలనే బ్రతికున్నారమ్మా! నిన్ను తలవని రోజు లేదు.

అస్సలు ఈ ఊరు నిన్ను మర్చిపోతేగా...

నిజంగానా?

అవును రాజీ! నీ చిలిపితనం, ముక్కుసూటి గా ఉండే నీ మాటలు ఎంత మందికిష్టమో నీకు తెలుసుగా! నిన్నెలా మర్చిపోతారనుకున్నావ్. అత్త య్య చెబుతుంటే నా హృదయం నలిగిపోతున్నట్ట నిపించింది. కన్నీళ్ళు పొంగి నా చెంపల్ని తడిపే శాయి.

అత్తయ్యా! నేను తప్పు చేశానా? అన్నాను.

తప్పని ఎవరన్నారు? ఆవేశపడి నువ్వే వెళ్ళి పోయావు.

తల్లిదండ్రులకు ఆమాత్రం అధికారం నీ మీద ఉండదా!

జరిగింది ఎందుకుగాని మీ ఇంటికెళ్దాం పద! అంటూ నన్ను నడవమంది.

చిన్న పిల్లలా అత్తయ్య వెనుకే బయలుదేరాను.

ఇన్నేళ్ళ తర్వాత అమ్మ, నాన్నలను చూడటం ఒక విధంగా పసిపాపకు అమ్మ ఒడిచేరడం వంటిది. నాలో వత్తిడి నాకు తెలుస్తూనే ఉంది. గుండె చప్పుళ్ళు, మనసుపడే ఆతృత, ఆవేదన స్పష్టమవు తూనే ఉన్నాయి.

ఎలా పలకరించాలి?

ప్రతిక్షణం కొత్త జీవితంలా అన్పిస్తోంది నాకు.

ప్రేమ, ఆప్యాయతలు అల్లుకు పోయే క్షణాలు నన్ను అలజడికి గురి చేస్తున్నాయి. ఆ క్షణాలు రానే వచ్చాయి. అమ్మను చూసేసరికి పరుగెత్తుకెళ్ళి అల్లుకు పోయాను. కాసేపటికి ఇద్దరి గుండె చప్పుళ్ళు సేదతీరాయి.

నాన్న, అన్నయ్యలు... అందరి చూపుల్లోను నిలువెత్తు అభిమానం.

నాన్న కళ్ళల్లోకి చూశాను. ఆయన కళ్ళల్లో వాత్సల్యం పొంగుతున్నట్టు కన్పించింది. నా చిన్నప్పుడు నాన్న అలానే నా వైపు చూసేవారు.

తెల్లారే సరికి ఊరంతా తెలిసిపోయింది.

వీళ్ళెవ్వరికీ నాపై కోపం లేదా?

ఒకప్పటి ఆప్యాయత చూపిస్తున్న వీళ్ళ మంచి తనం ముందు నేను ఓడిపోయానా?

నిజమే వాళ్ళ అభిమానం ముందు ఓడిపో యాను.

నిజానికి వాళ్ళంతా అడుగుతోంది నా గురించి కాదు... నా భర్త, పిల్లల గురించి.

నాలుగు రోజులు గడిచిపోయాయి.

వీళ్ళందరి అభిమానంతో ఇక్కడే ఉండిపోవా లనిపిస్తోంది నాకు.

అయినా ఉండలేని పరిస్థితి నాది. నేను వెళ్ళినా మళ్ళీ తిరిగి రావచ్చు కూడా!

అప్పుడిక వెనక్కి తిరిగి వెళ్ళే ప్రశ్నే ఉండదు.

OOO

నేను తిరిగి వెళుతున్న రోజది.

నా నిర్ణయం, నా మొండితనం తెలుసు కాబట్టి ఎవరూ నన్ను ఆగిపొమ్మని అడగలేకపోతున్నారు. అమ్మా, నాన్న పరిస్థితి కూడా అంతే!

అమ్మ అంటోంది... ఈసారి నీ భర్త, పిల్లల తోనే రావాలి అని!

ఓ నిజాన్ని దాచిన విషయం వీళ్ళెవరికీ తెలీదు. నేను తిరిగొచ్చానని ఆనందిస్తున్న వాళ్ళకు నిజమెలా చెప్పాలి? అందుకే ఆ నిజాన్ని మరోసారి చెప్పాలనే నిర్ణయించుకున్నాను.

కన్నీళ్ళు చెక్కిళ్ళను తడిపేస్తుంటే దూరంగా కన్పిస్తున్న మంజీర వైపు చూశాను.

చల్లటి గాలి ముఖాన్ని తాకేసరికి హాయి అన్పిం చింది.

అది కొద్ది సేపే!

చిన్నప్పుడు నదిలో ఇసుక దిబ్బల మీద ఆడు కున్న రోజులు గుర్తొచ్చాయి. మళ్ళీ ఆ రోజులొస్తే ఎంత బావుణ్ణు. ఎండిన నదిలో ఇసుక దిబ్బలమీద ఆడుకుంటూ గులకరాళ్ళు ఏరుకునే వాళ్ళం. ఆ ఆటలెంతో ఇష్టంగా ఉండేవి. చేతుల్లోంచి జారి పోయే గులకరాళ్ళ కోసం తిరిగి పోటీపడే వాళ్ళం.

గులకరాళ్ళతో చిన్నప్పుడు ఆడిన ఆటలే ఇప్పటి నా జీవితానికి పోలికలా ఉన్నాయి. నాకిష్టమైన, నేను కోరుకున్న జీవితం ఇప్పుడు నా దగ్గర లేదు. చేతుల్లోంచి జారిపోయే గులకరాయిలా నా జీవితం కూడా చేజారిపోయింది.

గుండెల్లో చురుక్కుమనిపించే ఒంటరితనం.

గుండెల్ని ఉప్పొంగించే వీళ్ళ అభిమానం...

నెమ్మదిగా ఆలోచనల్లోంచి బయటకు వచ్చా ను.

ఆ క్షణంలో నేను ఆలోచిస్తున్నది ఒక్కటే?

యాక్సిడెంట్‌లో నా భర్త, పిల్లలు చనిపోయా రన్న నిజం వీళ్ళకు తెలిస్తే...?